
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 26-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 175 పేజీలు: 8 వెల: రూ.7

# టీడీపీ సభ్యత్వ నమోదులో.. తగ్గిన జోష్!




* మొక్కుబడిగానే ఈ కార్యక్రమం * పాతపట్నం, శ్రీకాకుళం ఒకే.. మిగతా చోట్ల నాట్ ఓకే * మంత్రి అచ్చెన్న నియోజకవర్గంలోనూ అదే తీరు * ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మరీ దారుణం * ద్వితీయ శ్రేణి నాయకులపై మంత్రితో పాటు ఎమ్మెల్యేల అసహనం

**శ్రీకాకుళం, నవంబర్ 25 (వార్త):** టీడీపీ సభ్యత్వ నమోదులో ఏపీలోనే శ్రీకాకుళం జిల్లా ముందుండేది. నాయకులు, కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు చేసేవారు. ఊరువాడా ఈ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించేవారు. ఏ గ్రామం చూసినా పసుపు జెండాలతో, నేతల పర్యటనలతో కళకళలాడేది. పార్టీ అధికారంలో లేనప్పటికి కూడా ఈ సభ్యత్వ నమోదు జోరుగా సాగేది. ఈ ఏడాది ఏమైందో గాని టీడీపీ సభ్యత్వ నమోదు మొక్కుబడిగానే చేస్తున్నారు. ఏదో సభ్యత్వ నమోదు చేశాం.. అన్నట్టుగా మమ అనిపించేస్తున్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి ఎప్పటికప్పుడు డాష్ బోర్డులో నివేదికలు ఘోరంగా ఉండడంతో క్యాడర్ పని తీరుపై ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంద రూపాయలు రుసుం చెల్లించిన కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయలు బీమా సౌకర్యాన్ని కూడా అధిష్టానం అందిస్తోంది. కార్యకర్తలకు ఏదేనా కష్టం వస్తే అధిష్టానం ఆదుకుంటోంది. గతంలో వంద రూపాయలు చొప్పున సభ్యత్వ రుసుము వసూలు చేసేవారు కొన్ని ప్రాంతాల్లో పదవులు ఆశించే ముఖ్య నాయకులు ఆ మొత్తాన్ని కూడా చెల్లించేవారు. తర్వాత పివిసి కార్డులు వచ్చేవి. ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే మహానాడులో గుర్తింపు కార్డుల కోసం సభ్యత్వాలు చెల్లించేవారు. పార్టీ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు సభ్యత్వంలో ఉన్నాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో 200 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇది కూడా సభ్యత్వ నమోదుపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. కొంతమంది నేరుగా సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్నట్లు తెలిసింది. అయితే పివిసి కార్డ్ కావాలనే వారికి డౌన్ లోడ్ చేసి కార్డ్ ఇచ్చేందుకు 100 రూపాయలు అదనంగా వసూలు చేస్తునట్లు సమాచారం. కరోనా వంటి సమయంలో, పార్టీ అధికారం లేని సమయంలో కూడా సభ్యత్వాల్లో జోరుగా జోష్‌గా సాగేవి. ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ సభ్యత్వాలు ఊపకందుకోకపోవడంపై జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నతో పాటు ఎమ్మెల్యేలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## కొత్త ఎమ్మెల్యేల నియోజకవర్గంలో సూపరు..

కాగా, శ్రీకాకుళం జిల్లాలో సభ్యత్వ నమోదును పరిశీలిస్తే పాతపట్నం నియోజకవర్గం కాస్తా ఫరవాలేదు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన మామిడి గోవిందరావు, గొండు శంకరరావులు మాత్రం నియోజకవర్గంలో తిరుగుతూ సభ్యత్వ నమోదు జరిగేలా చూస్తున్నారు. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్న టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో మాత్రం సభ్యత్వ నమోదు దారుణంగా ఉంది. పాతపట్నం నియోజక వర్గంలో 43,202 మంది, పలాసలో 25,668 మంది, శ్రీకాకుళంలో 25,505 మంది, టెక్కలిలో 19,437 మంది, ఆమదాలవలసలో 15,366 మంది, నరసన్నపేటలో 16,998 మంది, ఇచ్ఛాపురంలో 17,133 మంది సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

## సభ్యత్వ నమోదుపై మంత్రి అసహనం

సభ్యత్వ నమోదు విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో సభ్యత్వ నమోదులో రాష్ట్రస్థాయిలో టెక్కలి నియోజకవర్గం ముందు ఉండేదని, ఈసారి చాలా వెనుకబడ్డామన్నారు. నందిగాం మండలంలో మరీదారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నియోజక వర్గంలో సభ్యత్వ నమోదులో వెనుకబాటుతనం సరికాదని, ప్రతి ఒక్కరు కదిలి పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని కేడర్‌కు మంత్రి సూచించారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లేముందు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సైతం పార్టీ కేడర్‌తో మాట్లాడి సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. అయినప్పటికీ ఈ కార్యక్రమం మందకొడిగానే సాగుతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ కేడర్‌లో జోష్ నింపేవారు లేకపోవడమే దీనికి కారణమన్న రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు

* ఎవరైనా వేధిస్తే వెంటనే ఫిర్యాదు చేయండి
* న్యాయ సహాయానికి ఒన్ స్టాప్ సెంటర్లు
* నెల రోజులు పాటు అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక కార్యక్రమాలు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* నగరంలో మహిళల భారీ ర్యాలీ

**శ్రీకాకుళం,నవంబర్ 25(వార్త:** మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం నుండి సంతోషిమాత గుడి వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కలసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక కార్యక్రమాలు నెల రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంపై మహిళల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డిఆర్డిఏ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు సంబంధించి న్యాయ కేంద్రాలు ఉన్నాయని, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుండి జిజిహెచ్ లో ఒన్ స్టాప్ సెంటర్ ఉందని మహిళలకు సంబంధించి కుటుంబ సమస్యలు ఉంటే న్యాయ సహాయం కోసం ఒన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒన్ స్టాప్ సెంటర్లు మహిళలు కోసం ప్రతీ చోటా ఉన్నట్లు చెప్పారు. ఇవే కాకుండా కౌన్సిలర్లను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ తర్వాత కోర్టులకు వెళ్లి లీగల్ ప్రొసీజర్ ఫాలవ్వడం ఉంటాయన్నారు. మండలాల వారీగా, సిడిపిఓ వారీగ మహిళలకు న్యాయ సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పిహెచ్సీ, సిహెచ్సీలో కౌన్సిలర్లు ఉంటారన్నారు. ఈ ర్యాలీ ద్వారా వైద్య ఆరోగ్య, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, డిఆర్డిఏ లతో పాటు సచివాలయ సిబ్బంది మహిళల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడైనా మహిళలపై గృహ హింస లేదా పని చేసే స్థలాల్లో హింస జరిగితే స్థానిక, ఇంటర్ డిపార్ట్మెంట్, కలెక్టరేట్ లలో కమిటీలు ఉంటాయని, ఎక్కడైనా మహిళలు పై వేధింపులు జరిగినట్లు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డిఆర్డిఏ, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యార్థులకు పోటీ పరీక్షలు

**జలుమూరు, నవంబర్ 25(వార్త):** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు పోటీ పరీక్షలను నిర్వహించామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఆయా హెచ్ఎంలు విద్యార్థులకు క్విజ్ పోటీలతోపాటు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మంగళవారం అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు.



# ఉద్దానంలో ఎయిర్‌పోర్టు వద్దు!

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 25 (వార్త):** ఉద్దానంలో విధ్వంసం సృష్టించే ఎయిర్‌పోర్టు చేపట్టవద్దని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని తీర ప్రాంత సుమారు గ్రామాల్లో పర్యటించి, ప్రజాందోళనకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉపాధ్యక్షుడు కుత్తుం హేమక్క, జానకమ్మ, పీవైఎల్ జిల్లా నాయకులు సార జగన్, ఇఫ్టూ నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు గ్రామాల్లో పర్యటించి బాధిత ప్రజలకు మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ అభివృద్ధి పనులను చేపట్టినా ప్రజా ప్రయోజనం, వారి ఆమోదం పరిగణనలోకి తీసుకుని పాలకులు ఆలోచన చేయాలని, ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని చేపట్టం సరికాదన్నారు. ప్రజలు తమ నిరసన తెలుపుతున్నార్న వాస్తవాన్ని ప్రభుత్వం గమనించాలని వారు కోరారు. ప్రజల భూములకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి బదులు, వారి జీవనాధారాన్ని ధ్వంసం చేస్తున్నామనే స్పృహతో ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ప్రజామోదం లేని ఈ నిర్మాణాలను ప్రభుత్వం ఇక్కడ మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాందోళన ఉధృతం కాకముందే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.



# డిసెంబర్ 22న పాణిగ్రాహి సంస్మరణ సభ

**పలాస, నవంబర్ 25(వార్త):** ఒక చేత పెన్ను, మరొక చేత గన్నుపట్టి పీడిత ప్రజల కోసం పోరాడి అమరుడైన పాణిగ్రాహి సుబ్బారావు 56వ స్మారక సభ బొడ్డపాడులోని అమర వీరుల భవనంలో డిసెంబర్ 22న జరగనుందని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం వారు స్మారక సభ కరపత్రం బొడ్డపాడు అమరవీరుల భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిగా, పోరాటకారుడుగా పీడిత ప్రజల ప్రజల తరఫున సాయుధ పోరా టం చేసిన వీరుడు పాణిగ్రాహి అన్నారు. విప్లవజ్వాలను శ్రీకాకుళంలో రగిలించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. తన కవితాగానంతో, కలకత్తా కాళీ మాత..రుచిమరిగేను మధుర మిఠాయి అంటూ అప్పటి బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పాటలు, కవితలు రాసి, యువతను శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటం వైపు చైతన్యపరిచి కదిలించారని కీర్తించారు. కార్యక్రమంలో ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలకంఠం, జిల్లా కార్యదర్శి రాపాక చిరంజీవి, శ్రీకాంత్‌కుమార్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ జిల్లా నాయకులు కొండే సూరి, న్యూడెమోక్రసీ రైతు కూలీ కమిటీ నాయకులు బాలకృష్ణ, సారా జగన్, మాధవ్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యదర్శి పోతనపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# పాతిన కృష్ణమూర్తి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ




**మందస, నవంబర్ 25(వార్త):** హరిపురంలో జరుగుతున్న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల్లో మంద సకు చెందిన ప్రముఖ రచయిత మామిడి కోదండరావు రాసిన పాతిని కృష్ణమూర్తి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా యూటీఎఫ్ జిల్లా సెక్రటరీ గొంటి గిరిధర్ మాట్లాడుతూ క్రమశి క్షణ, అంకితభావం, ఉదాత్త మానవీయ విలువలు, వినమ్రంగా మసలే సంస్కారం నిండిన పాతిని కృష్ణమూర్తి ప్రజా జీవితంతో, విప్లవోద్యమంతో పెనవేసుకుని పెరిగారన్నారు. బాల్యంలోనూ విద్యార్థి దశలోనూ ఆయన సామాజిక స్పృహ సమాజానికి చేరువ చేసిందన్నారు. రచయిత కోదండరావు ఉద్యమాలతో కృష్ణమూర్తి జీవితం పెనవేసుకుపోయిన తీరును తన అక్షరాల్లో వర్ణించారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కిశోర్ మురళీ మోహన్, లండ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా ఇసుక అక్రమ రవాణా

**ఆమదాలవలస, నవంబర్ 25 (వార్త):** ఆమదాలవలస మండలంలోని పలు ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక వివిధ ప్రాంతాలకు తరలిపోతోంది. దీనియితీ రాజకీయ నాయకులు అండదండలు ఉన్నాయ్యన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆమదాలవలస ఎస్ఐ వెంకటేష్ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు లారీలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఇసుకను దూసిలోని ర్యాంప్ నుంచి విశాఖకు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.






## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 వినతులు

**పలాస, నవంబర్ 25(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 వినతులు వచ్చాయి. వివిధ సర్టిఫికెట్లకు 9, ఇళ్ల కోసం 4, పింఛన్ల కోసం 3 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. మిగిలిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి



**పలాస, నవంబర్ 25(వార్త):** పలాసలో గల బీసీ విద్యార్థినుల, ఎస్టీ బాలుర వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, ఉపాధ్యక్షుడు హెచ్.రాజు మాట్లాడుతూ ఈ వసతి గృహాల్లో కనీసం తాగునీటి సదుపాయం లేదని వాపోయారు. బాలుర వసతిగృహంలో 130 మంది విద్యార్థులు ఉండగా.. కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంటనే ఆ వసతిగృహాలను తనిఖీ చేశారు. సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీఎస్‌టీపీ జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్



**ఇచ్ఛాపురం, నవంబర్ 25(వార్త):** ఆంధ్రప్రదేశ్ స్కూలు టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) జిల్లా అధ్యక్షుడిగా సప్పటి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడానికి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు ఉపాధ్యాయులు కె.పద్మనాభరెడ్డి, కె.చంద్రశేఖర్ రెడ్డి, కె.సుహాస్‌చంద్, కె.తేజేశ్వరరావు, బి.సంతోష్‌కుమార్ అభినందనలు తెలిపారు.

## గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం




**నరసన్నపేట, నవంబర్ 25(వార్త):** రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన బొరిగివలసలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేలో సవరణలు చేపడుతున్నామన్నారు. రైతుల పత్రాల్లో ఎటువంటి మార్పులు కావాలన్నా వాటిని సరి చేస్తామన్నారు.

## 1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**మందస, నవంబర్ 25(వార్త):** కొండలోగాం పంచాయతీ పరిధి చాపరాయి ప్రాంతంలోని సారా స్థావరాలపై దాడులు జరిపినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. సోంపేట ఎక్సైజ్, ఏఈఎస్టీఎఫ్(పలాస)అధికారులు, సిబ్బంది సంయుక్తంగా జరిపిన దాడుల్లో 1400 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ, అమ్మకాలు, రవాణా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 73 పశువులతో ఏడు వాహనాల సీజ్

**నరసన్నపేట, నవంబర్ 25(వార్త):** పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మడపాం టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరు బొలేరో వాహనాలతో పాటు ఓ కంటైనర్ లారీలో 73 పశువులు అక్రమ రవాణా అవుతున్నట్లుగా గుర్తించారు. వెంటనే ఆ వాహనాలను సీజ్ చేసి, పశువులను కొత్తవలస గోశాలకు తరలించారు. వాహన డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.





## మంత్రి అచ్చెన్నను కలిసిన జిల్లా యాదవ సంఘం

**కాశీబుగ్గ, నవంబర్ 25(వార్త):** రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని జిల్లా యాదవ సంఘం నాయకులు సోమవారం నిమ్మాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రి తమపై చూపిస్తున్న ఆదరాభిమానాలు మరువలేమని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఇప్పిలి జగదీష్, కలగ జగదీష్, లొడగల కామేశ్వరరావు, జానకి రామ్, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, కిక్కర ఢిల్లీరావు, కొరికాన శంకర్, సప్ప మన్మథరావు, కె.వైకుంఠరావు, బాడాడు రాజు, మురిపాల నాగయ్య ఉన్నారు.

## అంబేడ్కర్ వర్ధంతి సభను జయప్రదం చేయండి





**పలాస, నవంబర్ 25(వార్త):** అంబేడ్కర్ వర్ధంతి సభను మేధావులు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. డిసెంబర్ 6న ఈ సభ నిర్వహిస్తామన్నారు. సోమవారం వారు ఈ సభ కరపత్రాన్ని పలాసలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ మనువాదం, బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాంగహక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కి సన్మానం



**ఇచ్ఛాపురం, నవంబర్ 25(వార్త):** జనసేన పార్టీ నాయకులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజుని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి మురపాల లక్ష్మి మర్యాదపూర్వకంగా సోమవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ సమస్యలను తెలియజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి సమస్యలని తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో యాదవ దళం సభ్యులు కోట రామారావు, కాళ్ల లోకనాథం, డొక్కరి. ఈశ్వరరావు, మోహన్ రావు, లోకేష్ పాల్గొన్నారు.

## ధనుష్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

**మందస, నవంబర్ 25(వార్త):** మందసలోని పొందర ధనుష్ సమస్యను 'జాతీయవార్త' వెలుగులోకి తీసుకురావడంతో దాతలు స్పందించారు. పేద కుటుంబానికి చెందిన 11ఏళ్ల ధనుష్ తన గుండెకు రంధ్రం పడడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మందసలోని బోయి వీధికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆయన కుటుంబానికి సోమవారం రూ.20వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని సోషల్ వర్కర్ ఇప్పిలి కేశవరావు(చిట్టి)కి అందించారు.





# మహిళలను హింసిస్తే కఠిన చర్యలు





**పోలాకి, నవంబర్ 25(వార్త):** మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హెచ్చరించారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సమస్యలు, న్యాయ సహాయం కోసం జీజీహెచ్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వేధింపులపై మహిళలు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ర్యాలీలో బాల్యవివాహ రహిత భారతదేశం, జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం తదితర నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, ఏపీఎం రాజారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ ప్రతినిధి లుకలాపు రాంబాబు అధికారులు, విద్యార్థినీ..విద్యార్థులు, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వెలుగు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**జలుమూరు:** పురుషులతో పాటు సమానంగా మహిళలను గౌరవించాలని తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జలుమూరులో సోమవారం మహిళలపై హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో ప్రభుత్వం సమానహక్కులను కల్పించిందన్నారు. వీటి అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

**నరసన్నపేట:** మహిళలపై హింసను నిర్మూలించాలని అధికారులు పిలుపునిచ్చారు. సోమవారం నరసన్నపేటలో వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు, సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు అలసత్వం వహిస్తే చర్యలు



**సారవకోట, నవంబర్ 25(వార్త):** ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలుతప్పవని అధికారులకు జేసీ పర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. సోమవారం ఆయన బుడితి జంక్షన్ వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు.అన్నివిధాలా సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

**నరసన్నపేట:** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం ఆయన కరగాం పంచాయతీలో రైతుల కళ్లాల వద్దకు నేరుగా వెళ్లి ధాన్యం కొనుగోళ్లపై వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే నగదు జమ చేస్తామని చెప్పారు.



## సారా విక్రేతలు నలుగురిపై బైండోవర్

**వంగర, నవంబర్ 25(వార్త):** సారా అమ్ముతున్న నలుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. సోమవారం వంగర తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డి.ధర్మరాజు సమక్షంలో రుషింగి, సంగాం, గ్రామాలకు చెందిన ఒక్కొక్కరిపై, జేకే గుమ్మడి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఈ నలుగురు వ్యక్తులు సారా అమ్మేవారని, వీరికి ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా, వీరిలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా, మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపులు వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే, వారిపై కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సారా తయారు చేసి, అమ్మిన వారిపై స్థానిక పోలీసులు, సచివాలయ సిబ్బంది నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. సారా అమ్మినట్లు తమకు సమాచారం వస్తే విక్రయదారుల భరతం పడతామని హెచ్చరించారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

**పలాస, నవంబర్ 25(వార్త):** ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ఉమెన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ, సమస్త డీవీఎం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు తక్కువ ధరకే 22 నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. పలాస మండలం రామకృష్ణాపురం, లొద్దపద్ర, తర్లకోట గ్రామాలకు చెందిన సుమారు 60 మంది, కవిటి మండలంలోని కొత్తపాలెం, కర్రీవన్‌పాలెం గ్రామ మహిళలకు వీటిని అందించారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల కోఆర్డినేటర్లు పావని, శివప్రసాద్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు నేడు కృత్రిమ అవయవాల పంపిణీ

**మందస, నవంబర్ 25(వార్త):** మందస మండలంలోని సొండిపూడికి చెందిన మదర్‌థెరిస్సా వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు మంగళవారం పంపిణీ చేస్తామని ఆ సంస్థ చైర్మన్ ఎం.భాస్కరరావు తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆత్మగౌరవ దినోత్సవం సందర్భంగా మందసలోని వివేకానంద విద్యానికేతన్‌లో విజయనగరానికి చెందిన శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు వీటిని ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్టీసీ బస్సు రాయితీ పాస్, చంక కర్రలు, వినికిడి యంత్రం అందజేసేందుకు దరఖాస్తులు కూడా స్వీకరిస్తామన్నారు. యూఐడీ కార్డు లేని దివ్యాంగుల వివరాల నమోదు చేస్తామన్నారు, హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబరు తప్పక తీసుకురావాలని ఆయన కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో విజిలెన్స్ ఎస్పీ

**జలుమూరు, నవంబర్ 25(వార్త):** శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ప్రభాకరరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి ఆయన తెలుసుకున్నారు.



# ఆలయాలకు కార్తీక శోభ





**వంగర, నవంబర్ 25(వార్త):** ఉత్తరాంధ్రలో పవిత్ర పుణ్యక్షేత్రమైన సంగాం సంగమేశ్వరుని ఆలయం భక్తుల శివనామస్మరణతో సోమవారం హోరెత్తిపోయింది. త్రివేణి సంగమం నుంచి ఆలయం అంతటా మారుమోగింది. కార్తీక నాల్గవ సోమవారం సందర్భంగా వేకువజాము 2 గంటల నుంచే మద్దువలస, వంగర, నీలయ్యవలస, శ్రీహరిపురం, మరువాడ, గీతానాపల్లి, కోణంగిపాడు, అరసాడ, ఎం.సీతారాంపురం, తలగాం రాజులగుమ్మడ, జేకే గుమ్మడ, కొత్తవలస,కొప్పరవలస తదితర గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. త్రివేణి సంగమంలో వేలాది మంది భక్తులు స్నానాలాచరించి, శివుని వద్ద దీపాలు వెలిగించి, భక్తి శ్రద్ధలతో స్వామివారికి పూజలు జరిపారు. దీంతో ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులకు ఏ ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్యామలరావు, అధికారులు, చైర్మన్ బోను ఆనందరావు, ప్రధాన అర్చకులు ఎస్.గణపతి, సహ అర్చకులు ఎస్.చిన్నిబాబు అన్ని ఏర్పాట్లు చేశారు.

**జలుమూరు:** కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులకు శ్రీముఖలింగేశ్వరుని నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. సోమవారం ఉదయం జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. నిజరూప దర్శనం చేసుకునేందుకు వారు బారులు దీరారు.



# శివ్వాంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వంగర, నవంబర్ 25(వార్త):** శివ్వాంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సూచించారు. సేవలను పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. ఈక్రాప్ నమోదు ప్రకారం ఒక్క ధాన్యం గింజ కూడా మిగలకుండా వ్యవసాయ అధికారులు కొనుగోలు చేయాలని స్పష్టంచేశారు. అనంతరం ఆయన మండల వ్యవసా యాధికారి, వ్యవసాయ సిబ్బంది, రైతులుతో సమావేశం ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. అంతకంటే ఎక్కువ ధర వస్తే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాలని వారికి సూచించారు.


మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు మాట్లాడుతూ ధాన్యం విక్రయాల కోసం ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిస రన్నారు. గోనె సంచులు అందిస్తున్నా మన్నారు. ప్రభుత్వమే రవాణా చార్జీలు భరిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి లాభపడాలని రైతులకు సూచించారు.

కార్యక్ర మంలో శివ్వాం సర్పంచ్ ప్రతినిధి బొక్కెల వెంకప్పలనాయుడు, సీనియర్ నాయకుడు బొక్కెల సత్యం నాయుడు, టీడీపీ నాయకులు యు.మోహనరావు, మజ్జి శ్రీనివాస రావు, పీఏసీఎస్ ప్రత్యేకా ధికారి అరుణశ్రీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 25 (వార్త):** పలాస నియోజవర్గంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. పూండిలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కొన్ని ప్రజాసంఘాలు ప్రజలను రెచ్చగొట్టి ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించారన్నా రు. దీనికి అన్ని వర్గాల వారు సహక రించాలని ఆయన కోరారు. ఈ ప్రాం తానికి పరిశ్రమలు రావడంతో ఉద్దా నం అభివృద్ధి వైపు బాటలు వేస్తుంద న్నారు. ఈ ఎయిర్‌పోర్టుతో ప్రజలకు ఏ నష్టము ఉండదని, కొంతమంది నాయ కులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, దీనిని వారు గమనించాలని ఆయన కోరారు. అభివృద్ధిని అడ్డుకోవడం మంచిది కాదని ప్రజా సంఘాలకు, వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు. రైతులు అధిక ప్రయోజనం పొందేలా అందరం కలిసి ప్రయత్నిద్దామని ఆయన పిలుపునిచ్చారు.



కార్యక్ర మంలో అమలపాడు, కొత్తపేట మాజీ సర్పంచ్‌లు దున్న షణ్ముఖరావు, గోవిం దు పాపారావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు

**జలుమూరు, నవంబర్ 25(వార్త):** పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లను అందజేస్తున్నామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. సోమవారం ఆయన జలుమూరులోని ఎంఆర్సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం అనే దాత వీటిని సమకూర్చారన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## శ్రీముఖలింగం అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



**జలుమూరు, నవంబర్ 25(వార్త):** అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయి దేవి సూచించారు. సోమవారం ఆమె శ్రీముఖలింగంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటి గుంటలు మంజూరయ్యాయని, వీటి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## గ్రామైక్య సంఘాల బలోపేతానిక కృషి



**నరసన్నపేట, నవంబర్ 25(వార్త):** వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం శక్తి మహిళా సంఘాల బలోపేతానికి గ్రామైక్య సంఘాలు మరింత పటిష్టం కావాలని వెలుగు డీపీఎం బసవరాజు తెలిపారు. సోమవారం ఆయన నరసన్నపేట వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు రుణ బకాయిలు లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రామైక్య సంఘాలపై ఉందన్నారు.

## ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో చైతన్య సదస్సులు

**మందస, నవంబర్ 25(వార్త):** గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్దానంలో ఉద్యమం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపకల్ప నకు నాయకులు పలు గ్రామాల్లో పర్యటించారు. చైతన్యసదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ కొమర వాసుదేవు, లక్ష్మీనారాయణ, రాజారావు, అప్పారావు, గున్నయ్య పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

**నరసన్నపేట, నవంబర్ 25(వార్త):** గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు ఆదేశించారు. సోమవారం ఆయన నరసన్నపేట మండల పరిషత్ కార్యాల యంలో ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇంకా ప్రారంభించని గృహ నిర్మాణాలపై దృష్టి సారించి, లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546